

ప్రత్యేక చట్టం అవసరం

మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ ఉండేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కోల్‌కతాలో జరిగిన ఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఇలాంటి విషయాలలో నిందితులపై కఠినంగా వ్యవహరించాలి. రోగులకు డాక్టర్లు, సిబ్బంది నిత్యం సేవలందిస్తుంటారు. వారికి ప్రభుత్వం తాము అండగా ఉన్నామని ధైర్యం కల్పించాలి.

– డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, వైఎస్సార్ అండ్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకురాలు, రాజమహేంద్రవరం



భద్రత కల్పించాలి

వైద్యులను దేవునితో సమానంగా భావించే ఈ సమాజంలో.. వారి ప్రాణాలకు రక్షణ లేకుండా పోవడం దారుణం. కోల్‌కతా ఘటనతో మహిళా వైద్యులతో భయాందోళలను నెలకొన్నాయి. వాటిని పోగొట్టి, భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వైద్యులపై ఏవిధమైన ఒత్తిడి లేకుండా చూడాలి. అప్పుడే ప్రశాంత వాతావరణంలో వైద్యసేవలందిస్తారు. డాక్టర్లతో పాటు సిబ్బందికి కూడా పోలీసు రక్షణ ఉండాలి.

– డాక్టర్ జి.స్వరూప, వైద్యురాలు, కడియపులంక పీహెచ్‌సీ



క్లుప్తంగా

కన్నుల పండువగా నందనోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్యాపురంలోని రాధాకృష్ణ మందిరంలో మంగళవారం నందనోత్సవం కన్నుల పండువలా నిర్వహించారు. శ్రీకృష్ణ చైతన్య మిషన్, ఆశ్రమం, గౌరాంగ రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీల త్రిదండి స్వామి భక్తి వైభవ పూరీ గోస్వామి మహరాజ్, శ్రీల ఆచార్య దేవ త్రిదండి స్వామి భక్తి కమల గోవింద గోస్వామి మహరాజ్ ఆశీస్సులతో ఘనంగా ముగిశాయి. మందిర నిర్వాహకులు త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహరాజ్ పూజలు చేసిన అనంతరం నందోత్సవం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 50వ డివిజన్‌లోని భాస్కర్‌నగర్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, పారిశుద్యం, తాగునీరు, కల్వర్టుల నిర్మాణం, డ్రైనేజీ సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటిపై నగర పాలక సంస్థ అధికారులతో మాట్లాడి, ప్రాధాన్య తాక్రమంలో పరిష్కరిస్తామన్నారు.

గృహ నిర్మాణాలు చేపట్టాలి

ప్రకాశం నగర్: గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాల్లో ప్రస్తుత ప్రభుత్వం గృహ నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. స్థానిక ఇందిరా నగర్‌లో మంగళవారం పార్టీ క్వారీ ఏరియా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కార్పొరేషన్ అధిక ఇంటి పన్నులను వసూలు చేస్తోందని, ఈ భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ బిల్లులను తగ్గించాలన్నారు. వలంటీర్లకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ క్వారీ ఏరియా కార్యదర్శిగా టి.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా కొండావతి బేగం ఎన్నికయ్యారు.

పాత పెన్షన్ సాధించే వరకూ పోరాటం

రాజమహేంద్రవరం సిటీ: పాత పెన్షన్ విధానం సాధించే వరకూ పోరాటం సాగిస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీ కె.విజయ కుమార్ అన్నారు. పాత పెన్షన్ విధానం స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను ప్రకటించడంపై కార్మికులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం సాధనతో పాటు పలు సమస్యలు సాధించేందుకు కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇవ్వడానికి సిద్ధమవుతున్నామన్నారు. ఈ సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుంచి యూపీఎస్‌పై స్పష్టమైన హామీ వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇతర న్యాయపరమైన కోర్కెలను నెరవేర్చేవరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీలు డి.శ్రీనివాసరెడ్డి, తిరుమలదేవ్, జగన్నాథ రావు, చైర్మన్లు జయరాం, బాబు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని డీమార్ట్ సమీపంలో ఉన్న స్వర్ణ సింధూ ఏజెన్సీ గేటు సమీపంలో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఈ మేరకు వీఆర్వో బాపన్నయ్య బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు ఉంటుంది. ఒంటిపై నిక్కరు ధరించి ఉన్నాడు. దీనిపై ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 0883 2434173, 94407 96533 (ఇన్‌స్పెక్టర్) నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంటర్ విద్యార్థి మృతి



భరత్ (ఫైల్)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థి ఇంటికి వెళ్లిన అనంతరం కుప్పకూలి పోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆల్కాట్‌తోట వేమనవీధిలో నివాసం ఉంటున్న సిరసపల్లి భరత్ (16) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటికి సమీపంలో జరుగుతున్న ఉట్టి వేడుకల్లో సోమవారం సాయంత్రం ఉత్సాహంగా పాల్గొన్నాడు. అనంతరం తమ మూడంతస్తుల డాబాపైకి వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని నగరంలోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. కాగా.. భరత్ తండ్రి మురళీ సాక్షి టీవీ స్టాఫ్ కెమెరామెన్‌గా పనిచేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ వేమనవీధిలోని నివాసానికి వెళ్లి మురళీని ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే రౌతుసూర్యప్రకాశరావు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి మింది నాగేంద్ర, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్‌ప్రసాద్ తదితరులు భరత్ మృతదేహానికి నివాళులర్పించారు.

బొజ్జ నింపే గణపయ్య..

- త్వరలో వినాయక చవితి ఉత్సవాలు
- అనేక రంగాల కార్మికులకు ఉపాధి
- తొమ్మిది రోజులూ సందడే

ప్రకాశం నగర్: వినాయక చవితి సందడి త్వరలో ప్రారంభం కానుంది. తొలి పూజలు అందుకునే గణపయ్య ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఊరూరా విఘ్నేశ్వరుని విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. రాజస్థాన్ నుంచి కళాకారులు వివిధ రూపాలలో గణపయ్య ప్రతిమలను తయారు చేస్తున్నారు. రెండు అడుగుల నుంచి ఇరవై అడుగుల వరకూ విగ్రహాలు రూపొందిస్తున్నారు. వినాయక చవితి అంటే పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టం జరుపుకొంటారు. చవితి నుంచి తొమ్మిది రోజుల పాటు గణపతికి పూజలు చేయడం, ఆ తర్వాత నిమజ్జనాలు, అన్నసమారాధనలతో దాదాపు నెలంతా సందడి ఉంటుంది. కాగా.. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వివిధ రంగాల కార్మికులకు ఉపాధి దొరుకుతుంది. అలాగే వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతూ ఉంటాయి.

ఊరూవాడా సందడే

వినాయక చవితి వేడుకలు ఊరూవాడా ఘనంగా జరుగుతాయి. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలలో సుమారు 500 పైగా పందిళ్లు ఏర్పాటు చేసి స్వామివారిని ప్రతిష్ఠిస్తారు. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా పూజలు జరుపుతారు. ఈ నేపథ్యంలో విగ్రహాలను తయారు చేసే కార్మికులు, పందిళ్ల వేసే కూలీలు, ఎలక్ట్రిషియన్లు, సౌండ్ సిస్టమ్, మైక్ సెట్టింగ్ దుకాణదారులు, స్వామికి పూజలు చేసే పూజారులు, ఊరేగింపులు జరిపే ఆటోవాలాలకు ఉపాధి దొరుకుతుంది.



రాజమహేంద్రవరంలో జరుగుతున్న వినాయకుని ఊరేగింపు (ఫైల్)

జోరుగా వ్యాపారం

చవితి ఉత్సవాల ప్రారంభం నుంచే చిరు వ్యాపారులు, రైతులు విక్రయించే వివిధ రకాల పత్రి, పువ్వులు, పండ్లకు డిమాండ్ ఏర్పడుతుంది. వారి వ్యాపారం జోరుగా సాగుతుంది. వీటి విక్రయాల ద్వారా ఆదాయం సమకూరుతుంది. చవితి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా వినాయక చవితి మంటపాలు ఏర్పాటు చేస్తారు. వాటిలో పూజలు చేసే పూజరులు, పూజా సామగ్రికి డిమాండ్ ఏర్పడుతుంది. వినాయక మంటపాలకు విద్యుద్దీపాలంకరణ చాలా ముఖ్యం. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిషియన్లకు ఉపాధి లభిస్తుంది.

నాటకాలకు ఊపిరి

గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక, నాటక కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతాయి. దాదాపు అంతరించే దశకు చేరుకుంటున్న నాటకాలు ఈ రోజుల్లోనే ఊపిరి తీసుకుంటాయి. ఏడాదంతా ఖాళీగా ఉన్న కళాకారులు తమ ప్రతిభకు పదును పెడతారు. చవితి సందర్భంగా రాత్రి సమయంలో వేదికపై వివిధ నాటకాలను ప్రదర్శిస్తారు. తద్వారా కళాకారులకు ఉపాధి దొరుకుతుంది. ఇక నృత్యాలు, మిమిక్రీ, మ్యాజిక్ షో, ఆర్కెస్ట్రా, సన్నాయి వాయిద్యాలు, డ్రమ్స్ వాయించే కళాకారులు చేతి నిండా పని లభిస్తుంది.

అనుమతులు

వినాయక ఉత్సవ పందిళ్ల ఏర్పాటు చేయడానికి అధికారుల నుంచి అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఇందుకోసం ఉత్సవ కమిటీ నిర్వాహకులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. వాటిని అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. అలాగే నిబంధనల మేరకు ఉత్సవాలను నిర్వహించాలి. ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా పండగ జరుపుకోవాలి. వినాయక చవితి అనంతరం మూడో రోజు నుంచి నిమజ్జనాలు జరుగుతాయి. వాటికి తగిన ఏర్పాటు చేయడం కూడా అధికారుల పనే. అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో ఈ పనులు చేస్తారు.

పనికి లోటుండదు



రాజమహేంద్రవరంలో అనేక చోట్ల వినాయక మంటపాలు ఏర్పాటు చేస్తారు. వాటిని విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేస్తారు. అవి శోభాయమానంగా వెలుగుతూ ఎంతో ముచ్చటగా ఉంటాయి. ఈ క్రమంలో దాదాపు పది రోజులకు పైగా ఎలక్ట్రీషియన్లకు చేతినిండా పని ఉంటుంది.

– కె.ప్రసాద్, ఎలక్ట్రీషియన్

పూజారులకు డిమాండ్



వినాయక మంటపాల్లో పూజలు చేయడానికి పూజారులు చాలా అవసరం. చవితి ఉత్సవాల సందర్భంగా వారికి డిమాండ్ ఏర్పడుతుంది. దీంతో వారందరికీ ఉపాధి దొరుకుతుంది. పురోహితులతో పాటు అందరికి ఉపాధి లభించే పండగ ఏదైనా ఉందంటే వినాయక చవితే అని చెప్పాలి.

– జీవీ రంగాచార్యులు, పూజారి

కేసులను సత్వరం పరిష్కరించాలి

కంబాలచెరువు: కేసులను సత్వరం పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి అన్నారు. ఆమె మంగళవారం ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ కేసులలో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియమించిన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వాటిపై ఎలాంటి సమస్య ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. క్రిమినల్ కేసులకు సంబంధించి బెయిల్ కోసం వేసిన అర్జీల వివరాలు తెలుసుకున్నారు.

గోవింద క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ భగవానుడు

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువు గాంధీపురం–4 లోని గోవింద క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు శ్రీకృష్ణునిక నవకలశ తిరుమంజనం (అభిషేకం), మధ్యాహ్నం 4 గంటలకు ఉట్టి ఉత్సవం, అనంతరం కోయిల్ తిరువాయ్ మొజి విన్నపం, విశేష ఆరగింపులు, సాంస్కృతిక కాలక్షేపం, ఊంజల్ సేవ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారని అర్చకుడు తూపురాణి శ్రీమన్నారాయణాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మట్టపల్లి రంగప్రసాద్ రామ్‌కుమార్, సురేష్‌కుమార్ సోదరులు, డాక్టర్ బలభద్ర వెంకటరాజు, పులవర్తి లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్యామలాంబ జాతర



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు



కళాకారులతో డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక వేంకటేశ్వరస్వామివారి మతం వీధిలో కొలువైన శ్యామలాంబ అమ్మవారి జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిల్లా వెంకన్న, ప్రధాన కార్యదర్శి వెల్లంకి జయరాం తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట వాకచర్ల కృష్ణ తదితరులున్నారు.

అమ్మ భాషను కాపాడుకుందాం



గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ అధ్యక్షురాలు కాంతికృష్ణను సత్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: అమ్మ భాషను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ అధ్యక్షురాలు గిడుగు కాంతికృష్ణ పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరంలో కళాగౌతమి సాహిత్య సంస్థ 33 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో తాడితోటలో సంహిత కన్వెన్షన్ హాలులో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంతికృష్ణ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు భాష కోసం పడిన తాపత్రయంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. గిడుగు వారింట పుట్టడం తనకు చాలా గర్వకారణమన్నారు. పది నిమిషాల పాటు ఆంగ్ల పదం దొర్లకుండా తెలుగులో మాట్లాడిన వారికి నగదు బహుమతులు ఇస్తున్నామన్నారు. తెలుగు భాష స్థితిగతులపై వేదనతో గిడుగు వారికి లేఖ రాసే పోటీని ఆమె ప్రకటించారు. అందరూ లేఖలు రాసి పంపిస్తే గిన్నిస్ బుక్ లోకి ఎక్కే అవకాశం ఉంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో 30 ఏళ్లకు పైగా సాహితీసేవ అందిస్తున్న సంస్థ కళాగౌతమికి అభినందనలు తెలిపారు. కళాగౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి, యువతను జాగృతం చేయడానికి, సంస్కృతీ సంప్రదాయాలను ముందుతరాలకు అందజేయడానికి తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కళాగౌతమి అధ్యక్షులు డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, సామాజికవేత్త లోలభట్టు శ్రీనివాసరాజు, ఫైర్ బీఎఫ్ శ్రీహరి జగన్నాథ్, అవధాని తాతా సత్యసందీప్, డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, సంహిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



కలెక్టర్ ప్రశాంతికి మొక్కను అందజేస్తున్న ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టర్ పి.ప్రశాంతిని మంగళవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

యోగాకు మరింత ప్రోత్సాహం అవసరం



యోగాసన పోటీల విజేతలతో విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు మరింత ప్రోత్సాహం అందజేయాలని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఈస్ట్ గోదావరి ఆధ్వర్యంలో స్థానిక ఏపీ పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మంటపంలో మంగళవారం జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ కృషితో ఒలింపిక్స్‌లో యోగాను ఒక క్రీడగా ప్రవేశపెట్టడం తథ్యమన్నారు. శ్రీధర్ రెడ్డి ఇటీవల యోగాలో గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యారన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా యోగా క్రీడాకారులు ప్రతిభ ప్రదర్శించాలని ఆకాంక్షించారు. నేషనల్ జడ్జి కర్రి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తనతో పాటు ముగ్గురు క్రీడాకారులు గిన్నీస్ బుక్‌లో పేరు నమోదు చేసుకున్నారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలిచిన యోగసన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. జడ్జిలుగా వ్యవహరించిన అనంతలక్ష్మి, జి.శ్రీనివాస్, బి.అరుణకుమార్, కె.హేమ నిర్మలారెడ్డి, శ్యామ్ సుందర్‌లకు కూడా సర్టిఫికెట్లు అందించారు.

మహిళలకు మగ్గం వర్క్‌లో శిక్షణ

రాజానగరం: దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో మంగళవారం మగ్గం వర్క్‌లో శిక్షణ ప్రారంభించారు. సుమారు 60 మంది ఈ శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. అవసరమైన మెటీరియల్ అందించి, శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. ఇంతవరకూ తమ ఫౌండేషన్ ద్వారా సుమారు నాలుగు వేల మంది మహిళలు శిక్షణ పొంది, ఉపాధి అవకాశాలను పెంపొందించుకున్నారన్నారు. ఈ శిక్షణకు అల్లంపల్లి రూప ట్రైనీగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామి పాల్గొన్నారు.

ఏఎస్‌డీ, ఆర్ట్స్ కళాశాలల ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న రెండు కళాశాలల అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల, కాకినాడ ఏఎస్‌డీ మహిళా కళాశాలలు రసాయన శాస్త్ర విభాగానికి సంబంధించి పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనిలో భాగంగా రసాయన శాస్త్ర విద్యార్థులకు బోధన, పరిశోధన తదితర అంశాలలో ఇరు కళాశాలల అధ్యాపకుల పరస్పర మార్పిడి ద్వారా సహకరించుకోనున్నాయి. ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ విద్యార్థులకు బోధన, పరిశోధన అంశాలపై ఆసక్తిని కలిగించడానికి ఈ అవగాహన ఒప్పందం సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇరు కళాశాలల రసాయన శాస్త్ర విభాగాధిపతులు టి.శ్రీనివాసరావు, డాక్టర్ అనిత, అధ్యాపకులు డాక్టర్ జె.సురేష్ పాల్గొన్నారు.

108 రకాల పిండి వంటలతో నైవేద్యం



రాజవోలు గాయత్రీ నగర్ వైకుంఠపుర దేవాలయంలో నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గాయత్రీ నగర్‌లోని వైకుంఠపుర దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆహోబిల రామానుజ జీయర్ స్వామివారి గోష్ఠి ఆధ్వర్యంలో స్వామివారికి 108 రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



బొమ్మూరులోని రాధాకృష్ణ మందిరంలో..

రాధాకృష్ణ మందిరంలో..

రాజమహేంద్రవరం రూరల్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా బొమ్మూరు మురళీకొండపై ఉన్న రాధాకృష్ణ మందిరంలో మంగళవారం అహోబిల రామానుజ జీయర్‌స్వామి గోష్ఠి ఆధ్వర్యంలో స్వామివారికి 108 రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. ముందుగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉట్టి ఉత్సవం జరిపారు.

గణేష్ మంటపాలకు అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం సిటీ: వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి పండగను అత్యంత జాగ్రత్తగా నిర్వహించే క్రమంలో మునిసిపల్, మండల స్థాయిలో అనుబంధ శాఖలతో సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. ఆగస్టు 30 లోగా సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు సిద్ధం చేయాలన్నారు. అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు.